క్లుప్తంగా

నేడు మున్సిపల్ సమావేశం

పుత్తూరు: పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్‌లో సాధారణ సమావేశం చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘ నూతన భవనంలో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరవుతున్నారని తెలిపారు. సమావేశానికి వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో సీగ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను ఏగ్రేడ్‌లోకి రావడానికి హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు త్వరలో సిలబస్ పూర్తి చేసి సీగ్రేడ్‌లో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఏగ్రేడ్ చేయాలన్నారు. ముఖ్యంగా ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్‌పై భయం పోగొట్టాలని తెలిపారు. అలా చేస్తే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులను పద్యాలు, ప్రశ్నలు అడిగారు. పిల్లలు చక్కగా సమాధానం చెప్పడంతో సంతోషం చెందారు.

బంగారయ్య ఆదర్శప్రాయుడు



బంగారయ్య దంపతులను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ స్వరూప, సిబ్బంది

కార్వేటినగరం: ప్రతి ఒక్కరికీ విధి నిర్వహణలో బంగారయ్య ఆదర్శప్రాయుడని రాజా కుమార రాజా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.స్వరూప అన్నారు. బుధవారం జూనియర్ కళాశాల ఆవరణలో పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ బంగారయ్య విధుల పట్ల నిబద్ధతగా వ్యవహరించే వారని ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం పెనుమూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ బంగారయ్య క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే వారని కొనియాడారు. విధి నిర్వహణలో పూర్తి సమర్థవంతుడని, సిబ్బందికి ఆదర్శంగా నిలిచేవారన్నారు. అనంతరం అధ్యాపకులు డాక్టర్ కమలాకర్ రెడ్డి అభినందన గేయమాలికను సమర్పించారు. ఈ క్రమంలో భాగంగా వివిధ కళాశాలల నుంచి హాజరైన అధ్యాపకులు, బంధుమిత్రులు, సిబ్బంది బంగారయ్యను శాలువలు, గజమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హేమలత, సుబ్బారావు, విజయకుమార్, వేణుగోపాల్, సురేష్‌బాబు, ప్రదీప్‌కుమార్, డాక్టర్ మాధవనాయుడు, రామకృష్ణ పలువురు పాల్గొన్నారు.

కోలాహలం.. నిమజ్జనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం టాప్‌లైన్‌లో బుధవారం సాయంత్రం గుండాలమ్మ నిమజ్జనాన్ని అట్టహాసంగా నిర్వహించారు. విశేష పూజలు చేసి అమ్మవారిని స్థానిక వీధుల్లో డప్పు వాయిద్యాల హోరు నడుమ ఊరేగించారు. అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు.

కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్



వేదికపై జడ్జిలు గోపాలకృష్ణ, రాఘవేంద్ర, జానకి, సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు

- 29న పుత్తూరులో జాతీయ లోక్‌అదాలత్
- మాదక ద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత
- సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర

పుత్తూరు: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర కోరారు. బుధవారం కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ న్యాయవాదులు అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ప్రధానంగా రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేయాలని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో లేని ప్రీలిటిగేషన్ కేసులను సైతం లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. నగదుతో పాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. తద్వారా పెద్దసంఖ్యలో కేసులు పరిష్కరించబడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మాదక ద్రవ్యాల నివారణ అందరి బాధ్యత..

మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సి.జానకి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ తమవంతు కృషికి కట్టుబడాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసైతే విలువైన జీవితం ఛిద్రం అవుతుందన్న విషయాన్ని విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల వాడకం నేర ప్రవృత్తిని ప్రేరేపిస్తుందని తెలిపారు. అలాగే లైంగిక వేధింపులను నిర్మూలించాలని, పని చేసే చోట స్త్రీలను గౌరవించాలని సూచించారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రజలు తమవంతు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పిల్లలు ఎప్పుడూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పరిరక్షణలో ఉండాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి వి.గోపాలకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.పురుషోత్తం, న్యాయవాదులు పాల్గొన్నారు.

తరగని మాతృ ప్రేమ



పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

నగరి : తల్లి ఆరోగ్యంగా ఉంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది. ఆ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం బాగుంటుంది. ఇలా కుటుంబం బాగుంటే సమాజం బాగుంటుందనే తత్వంతో గర్భిణులకు మాజీమంత్రి ఆర్‌కే రోజా అందిస్తున్న ఉచిత పౌష్టికాహారం పంపిణీ కొనసాగుతోంది. రాజకీయ పరిణామాలకు అతీతంగా తన సేవను ఆమె కొనసాగిస్తూనే ఉన్నారు. బుధవారం నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రులకు విచ్చేసే గర్భిణులకు ఆమె ఎప్పటిలాగే పౌష్టికాహారం అందించగా పలువురు గర్భిణులకు వారితో పాటు వచ్చే చిన్నారులకు కడుపు నింపింది.

పట్టాలు రద్దు చేయాలని ధర్నా



వడమాలపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

పుత్తూరు: భూస్వాములకు అక్రమంగా ఇచ్చిన పట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దళితులతో కలిసి సీపీఎం పార్టీ నాయకులు బుధవారం వడమాలపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ వడమాలపేట మండలం యనమలపాళెం దళితవాడ ప్రజలకు ఇళ్ల నిర్మాణాల కోసం 1975లో తిరుమణ్యం లెక్కదాఖలాలోని 195/3లో 5.12 ఎకరాల భూమిని ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. ఇందులో 3.22 ఎకరాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకున్నారని, మిగిలిన భూమిని ప్రస్తుత వడమాలపేట తహసీల్దార్ భూస్వాముల పేరిట పట్టాలు ఇచ్చి, 1బీలో పేర్లు మార్చడం దారుణమన్నారు. భూస్వాములకు కొమ్ముకాసిన తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని, తప్పుడు పట్టాలను రద్దు చేసి సదరు భూమిని దళితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని సమస్యను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అంతకుముందు దళితులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నందయ్య, పురుషోత్తం, శ్రీనివాసులు, గ్రామస్తులు మునిబాల, దాము, నాదముని, ధనుంజయులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా మహాభారత ఉత్సవాలు



ద్రౌపదీ మాన సంరక్షణ నాటకంలోని ఓ దృశ్యం, తపస్మాన్ అధిరోహిస్తున్న అర్జున వేషధారి

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట గ్రామంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన ద్రౌపదీ మానసంరక్షణ నాటకం అలరించింది. దుశ్శాసనుడు ద్రౌపదీదేవిని ఇబ్బంది పెట్టే సన్నివేశాలను కళాకారులు రక్తి కట్టించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అర్జున తపస్మాన్ కార్యక్రమం జరిగింది. అర్జున వేషధారి శివభక్తి గీతాలు ఆలపించి మైమరిపించారు. సంతాన ప్రాప్తి కోసం మహిళలు వరపడ్డారు. మధ్యాహ్నం భాగవతారిణి స్వర్ణలతచే హరికథా కాలక్షేపం జరిగింది.



ద్రౌపదీ మాన సంరక్షణ నాటక ప్రదర్శనను వీక్షిస్తున్న ప్రజలు

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

నాగలాపురం: మండలంలోని బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, సీడీపీఓ శోభారాణి ఆధ్వర్యంలో బాల్య వివాహం, నేను బడికి పోతా, డయేరియా తదితర అంశాలపై అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించా రు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివా హం చేయడం చట్టరీత్యా నేరమని, అలాగే బడిఈడు పిల్లను బడికి పంపాలని, మన చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని శుభ్రమైన నీటిని తాగడంతో డయేరియా తదితర వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్లు,ఆయాలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించరూ!

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కుప్పంలో సీఎం చంద్రబాబుకు ఆ సంస్థ కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు బుధవారం కోరారు. సంస్థలలో మూడు దశాబ్దాలకు పైబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అరియర్స్, పీఆర్సీ, ఇంక్రిమెంట్లను వెంటనే విడుదల చేయాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులకు సంబంధించి వారి పిల్లలకు కారుణ్య నియమాకం కింద ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమకుమార్, జిల్లా కోశాధికారి రాజు, మణికంత, మదన్‌కుమార్, రాజు పాల్గొన్నారు.


వసతి గృహాల్లో తనిఖీలు



ఆర్‌ఓ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, వసతి గృహం వద్ద డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు: పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి బుధవారం తనిఖీలు నిర్వహించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతతో మెలగాలని వసతి గృహాలు, పాఠశాలల అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరిశుభ్రమైన మధ్యాహ్నం భోజనం పంపిణీ, ఆర్‌ఓ సిస్టమ్ తాగునీరు వంటి సౌకర్యాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టాయిలెట్స్‌ను ప్రతిరోజూ శుభ్రపరచాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, టీకాలు రోటా వైరస్, మీజల్స్ వంటి వ్యాక్సిన్లు వేయించడం వంటి కార్యక్రమాలు సకాలంలో చేపట్టాలని సూచించారు.

అయ్యోర్లు.. టార్గెట్



- ప్రైవేట్ టీచర్లపై యాజమాన్యాలు ఒత్తిడి
- విద్యార్థులను చేర్పించకపోతే ఉద్యోగం లేనట్టే
- బడులు ప్రారంభమైనా ఆగని ఒత్తిళ్లు
- విద్యాశాఖ అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే

చిత్తూరు కలెక్టరేట్: నియోజకవర్గంలోని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న టీచర్ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఆయా యాజమాన్యాలు విద్యార్థుల అడ్మిషన్లు చేయాలని టార్గెట్లు నిర్దేశించాయి. 2024–25 విద్యాసంవత్సరం ప్రారంభమై 13 రోజులు పూర్తవుతోంది. సెలవుల్లో మొత్తం టార్గెట్లు విధించి వేధించిన యాజమాన్యాలు ఇప్పుడు కూడా అలానే చేస్తున్నారని టీచర్లు ఆందోళన చెందుతున్నారు. అడ్మిషన్ల టార్గెట్ పూర్తి చేయాల్సిందేనని ఒత్తిడి చేస్తుండడంతో కొత్తగా విద్యార్థులను చేర్పించలేక, ఉద్యోగాన్ని వదులుకోలేక అవస్థలు పడుతున్నారు. ఓ వైపు విద్యాబోధన, మరోవైపు టార్గెట్ల ధాటికి కార్పొరేట్ విద్యాసంస్థల టీచర్లు సతమతమవుతున్నారు. అసలే ఇచ్చేది అరకొర జీతాలని, ఈ టార్గెట్లు తలకు మించిన భారంగా మారాయని వాపోతున్నారు.

వేసవి సెలవుల్లోనూ..!

వేసవి సెలవుల్లో టీచర్లు, విద్యార్థులు సేదతీరడం పరిపాటి. అయితే ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు తమ సిబ్బంది, ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో కూడా విద్యార్థులను చేర్పించే పని అప్పగించారు. విద్యార్థులను చేర్పించినందుకు ఉపాధ్యాయులకు కొంత నగదు ఇస్తున్నా వారికి విధిస్తున్న టార్గెట్లను పూర్తిచేయడానికి పడరాని పాట్లు పడుతున్నారు. మండు టెండల్లో ఊరూరా తిరిగి పిల్లలను చేర్పించేందుకు శ్రమిస్తున్నారు.

చెబితే చేయాల్సిందే..

చిత్తూరు నియోజకవర్గంలో దాదాపు 216 ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉండగా వాటిలో సుమారు 1.15 లక్షల మంది చదువుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో దాదాపు 12 వేల మందికి పైగా ఉపాధ్యాయులు, సిబ్బంది పనిచేస్తున్నట్లు అంచనా. స్కూళ్ల నిర్వహణ ఖర్చులు పెరిగాయని, దానికి తగ్గట్లు విద్యార్థుల సంఖ్య పెరగకుంటే జీతాలు చెల్లించడం కష్టమని చెప్పి సిబ్బందిని బెదిరిస్తున్నట్లు వాపోతున్నారు. యాజమాన్యం చెబితే చేయాల్సిందే. ప్రైవేటు స్కూళ్లలో ఉపాధ్యాయులు, సిబ్బంది స్కూల్ యాజమాన్యాలు ఏ పని చెబితే అది చేయాల్సిందే. లేదంటే ఉద్యోగం ఊడిపోతుంది. గతంలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక విభాగం అంటూ ఉండేది. ప్రస్తుతం దానిని తొలగించి మొత్తం పని ఉపాధ్యాయులతోనే చేయిస్తున్నారు. 6 నుంచి పదవ తరగతి వరకు అదనపు క్లాసులు ఏర్పాటు చేస్తూ ఉపాధ్యాయులపై మరింత ఒత్తిడి పెంచుతున్నారు.

విద్యాశాఖ తనిఖీల్లేవ్!

ప్రైవేటు విద్యాసంస్థల్లోని మౌలిక వసతులు, సిబ్బంది సమస్యలపై విద్యాశాఖాధికారులు తనిఖీలు చేయాల్సివున్నా ఆ దిశగా చేయడం లేదు. అధికారులు స్కూళ్లకు వెళ్లి పరిసరాలను పరిశీలించకుండా, సిబ్బంది సమస్యలను తెలుసుకోకుండానే యాజమాన్యాలతో మొక్కుబడిగా మాట్లాడి వెళ్లిపోతున్నారని, ఫిర్యాదుచేస్తే ఉద్యోగం ఊడిపోతుందనే భయంతో తాము మిన్నకుండిపోతున్నామని టీచర్లు చెబుతున్నారు.

నియోజకవర్గ సమాచారం

నియోజకవర్గంలోని మొత్తం పాఠశాలలు	:	317
ప్రైవేట్ పాఠశాలలు	:	216
ప్రభుత్వ పాఠశాలలు	:	101
ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు	:	1.15 లక్షలు
ప్రైవేట్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు	:	12 వేల మంది

నిబంధనలు పాటించాల్సిందే



ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. టీచర్లకు ఎక్కడైనా ఇబ్బంది ఉన్నట్లైతే మాకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదులు అందింతే విచారణ చేసి న్యాయం చేస్తాం.

– చంద్రశేఖర్, డీవైఈఓ, చిత్తూరు

యువతా.. మత్తుకు బానిస కావొద్దు

- పెరుగుతున్న డ్రగ్స్ వినియోగాన్ని అరికడదాం
- యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ



మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న యూత్ అసోసియేషన్, పోలీసులు

నగరి : పెరుగుతున్న డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలంటూ యూత్ అసోసియేషన్ సభ్యులు పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. బుధవారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వారు ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలని నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీకి సీఐ సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్జీఓ సంస్థలు, విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి ఈ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. అనంతరం యూత్ అసోసియేషన్ సభ్యులు తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించి డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలని, యువత డ్రగ్స్ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత బానిక కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువకుల చేత డ్రగ్స్ వ్యతిరేక ప్రమాణస్వీకారం చేయించారు.

డిగ్రీకళాశాలలో..

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వేణుగోపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం యుక్త వయసులో సంతోషంగా ప్రారంభమై, మధ్యవయసులో జీవితం విషాదంతో అంతం అవుతుందన్నారు. ప్రతి నేరానికి మూల కారణం మత్తు పదార్థాలేనని, కావున వాటికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం హోదాకు తగినట్టు వివిధ రూపాల్లో హెరాయిన్, కొకైన్, గంజాయి వంటి వివిధ రకాలుగా ఉందని ఇది వ్యక్తిని, కుటుంబాలను ఛిద్రం చేస్తోందన్నారు. తల్లిదండ్రుల ప్రేమ స్వచ్ఛమైందని, ప్రేమతో తల్లిదండ్రులు చెప్పే మాటలను విని, పాటించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రాంగణం నుంచి డిగ్రీకళాశాల వరకు ర్యాలీ చేపట్టారు.



మాదక ద్రవ్యాల గురించి ప్రసంగిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల అధ్యాపకులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

తిరుపతి కల్చరల్: చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, మారేపల్లి గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రికెట్ ఆడుతున్న దళిత యువకులపై వేణుగోపాలపురం, వావిల్‌చెరువుచేనుకు చెందిన అగ్రవర్ణాలు కరెంట్ పోల్‌కు కట్టివేసి దళిత యువతను దాడి చేసి గాయపరచడం దుర్మార్గమన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నేతలు శాంతి యాదవ్, వెంకటేష్ గౌడ్, భానుప్రకాష్, నాగరాజు, నవీన్‌భాస్కర్ పాల్గొన్నారు.